సాక్షి
కరీంనగర్
శనివారం | 4 | నవంబర్ | 2023

NOMINATIONS!

నామినేషన్ల వివరాలు.. 1వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
కరీంనగర్	03	03
హుజూరాబాద్	01	01
మానకొండూర్	00	00
చొప్పదండి	00	00

I
అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా..
ఎన్నికల పరిశీలకులు వీరే..
రాష్ట్రంలో మాదిగలకు తీరని అన్యాయం IIలో..

కోడ్ ఉల్లంఘనలపై కొరడా!

- ఎమ్మెల్యే అభ్యర్థులపైనా కేసులు
- సమావేశాలు, ప్రచారంపై నిరంతర నిఘా
- డీజేలు, పోస్టర్లున్న వాహనాలు సీజ్
- జీవనోపాధి పోతుందంటూ ఆటోడ్రైవర్ల లబోదిబో


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ నరేందర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘనలపై పోలీసులు కొరడా ఝళిపిస్తున్నారు. సీపీ అభిషేక్ మహంతి ఆదేశాలతో కేసులు నమోదు చేస్తున్నారు. నాలుగు రోజుల్లో 16 కేసులు నమోదవడం, అందులో అన్ని పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఉండటం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా గుమిగూడినా, మందు, విందులు ఏర్పాటు చేసినా, సమయం దాటి ప్రచారం కొనసాగించినా, డీజే వాహనాలు వాడినా, ఆఖరుకు ఎమ్మెల్యే అభ్యర్థి పోస్టర్లు వాహనాలకు వేసుకున్నా కేసులు పెడుతూ.. ఆ వాహనాలు సీజ్ చేస్తున్నారు. కొన్ని పార్టీల వారు ప్రచారంలో భాగంగా ఆటోలు, కార్లపై పోస్టర్లు అంటిస్తున్నారు. ఆ వాహనాలను సీజ్ చేయడంతో తాము జీవనోపాధి కోల్పోతున్నామని డ్రైవర్లు లబోదిబోమంటున్నారు.

- కేశవపట్నం మండలంలోని ఎరడపల్లికి చెందిన మాతంగి హరికృష్ణ, కలకుంట్ల రంజిత్‌రావు, పోతునూరి హరీశ్, వి.సాయికృష్ణ గత మంగళవారం డీజేతో మానకొండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయికి ప్రచారం చేసినందుకు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.
- చొప్పదండిలో బీఆర్‌ఎస్‌కు చెందిన మహేశుని మల్లేశం, కొత్తూరి నరేశ్, మహేశ్, ఎన్నం మనోహర్, శ్రీకాంత్ అనుమతి లేకుండా స్థానిక ఫంక్షన్‌హాల్లో దాదాపు 100 మందికి భోజనం, మద్యం సరఫరా చేయగా.. కేసు నమోదైంది.
- కరీంనగర్ గీతాభవన్ చౌరస్తాలో ఎం.హరీశ్ కారులో అనుమతి లేకుండా తరలిస్తున్న బీజేపీకి సంబంధించిన 500 కరపత్రాలు, 10 పార్టీ కండువాలు గుర్తించి, కేసు నమోదు చేశారు.
- హుజూరాబాద్‌లో మంగళవారం టీడీపీకి చెందిన ఐత హరీశ్, రామగిరి అంకూస్, ఆడెపు రవీందర్, లింగారావు, ఫయాజ్ అనుమతి లేకుండా అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చినందుకు కేసు నమోదైంది.
- కమాన్ చౌరస్తా వద్ద తనిఖీల్లో శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన నందికొండ మహేందర్‌రెడ్డి కారుపై బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి పోస్టర్‌ను ప్రదర్శించినందుకు కేసు నమోదైంది.
- తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన వరికోళ్ల చంద్రయ్య తన ఆటోపై బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి పోస్టర్ ప్రదర్శించినందుకు వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.
- గంగాధరకు చెందిన పులి మారుతి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం బుధవారం అనుమతి లేకుండా వంద మంది కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రామడుగులోని ముదిరాజ్ సంఘం భవనం వరకు డీజే వినియోగంపై కేసు నమోదైంది.
- గంగాధరకు చెందిన లోక రాజేశ్వర్, రామిడి సురేందర్, సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ తాడిచెరువు గ్రామ శాఖ అధ్యక్షుడిపై కేసు నమోదైంది. బుధవారం బీఆర్‌ఎస్ చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్ సమయం దాటినా ప్రచారం నిర్వహించినందుకు కేసు నమోదు చేశారు.
- మానకొండూరులో నిర్వహించిన తనిఖీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని మండపల్లికి చెందిన జగ్గాని శివ, చొప్పదండి శ్రీనివాస్ కారులో సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌కి సంబంధించిన 180 కరపత్రాలు, 50 బుక్‌లెట్‌లను పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.
- జమ్మికుంట పరిధి జగ్గయ్యపల్లెలో బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఎన్నికల ప్రచార వాహనంలో డీజే వినియోగంపై అబ్దుల్ కరీమ్, బడే జేమ్స్, వడ్డేపల్లి సతీశ్, వడ్డెపల్లి పోచయ్యలపై కేసు నమోదైంది.
- కరీంనగర్ మున్సిపల్ ఆఫీస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్‌కి చెందిన జమీల్‌ఖాన్ తన ఆటోపై బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి పోస్టర్‌ను అంటించినందుకు వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.
- కశ్మీర్‌గడ్డలో బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ మహమ్మద్ మహబూబ్ ఖాన్ మైనారిటీ యూత్ ఆత్మీయ సమావేశంలో 500మందికి చికెన్ బిర్యానీతో విందు ఏర్పాటు చేసినందుకు కేసు నమోదైంది.
- చొప్పదండిలో గురువారం బీఆర్‌ఎస్ టౌన్ ప్రెసిడెంట్ లోక రాజేశ్వర్ రెడ్డి,బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 300 మందితో సమావేశం నిర్వహించారు. ఇక్కడ డ్రోన్ వినియోగంపై రాజేశ్వర్ రెడ్డి, రవిశంకర్, రాజులపై కేసు నమోదు చేశారు.
- ఇంటింటి ప్రచారానికి బదులుగా గర్శకుర్తిలో పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేసినందుకు పులి మారుతి, చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం, గ్రామ శాఖ అధ్యక్షుడు చిప్ప చక్రపాణిలపై కేసు నమోదైంది.
- కనపర్తి సర్పంచ్ పర్లపల్లి రమేశ్, వల్బాపూర్ సర్పంచ్ ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మొలుగు పూర్ణచందర్ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాలకు జెండాలు కట్టడం, టపాసులు పేల్చడంపై గురువారం కేసు నమోదు చేశారు.
- హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్, పార్టీ వీణవంక మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి వీణవంకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 300 మందితో సమావేశం నిర్వహించినందుకు కేసు నమోదు చేశారు.



క్షుణ్ణంగా పరిశీలించండి

నగరంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్/హుజూరాబాద్/మానకొండూర్: శాసనసభ అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయంలో ఆర్వోలు ప్రతీ డాక్యుమెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పర్వం శుక్రవారం ప్రారంభం కాగా.. కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో చేపట్టిన నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ అనంతరం అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ క్యాండిడేట్ హ్యాండ్‌బుక్ మొదలైనవి అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించారు. సీపీ అభిషేక్ మహంతి, కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.



అలర్ట్‌గా ఉండాలి

మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పోలింగ్‌కు సమయం తక్కువగా ఉన్నందున రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని, విధుల్లో అలర్ట్‌గా ఉండాలని కేంద్రబలగాలకు సీపీ అభిషేక్ మహంతి సూచించారు. శుక్రవారం పీటీసీలో ఎన్నికల విధులకు వచ్చిన కేంద్ర బలగాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. జిల్లాలోని సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్‌ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల్లో గొడవలు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారి వివరాలు సేకరించి, కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ, పోలీసుల వాహనాన్ని సైతం వదలకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. కేంద్ర బలగాలకు విధుల నిర్వహణలో పూర్తి స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు మురుగవేల్, అనుజ్‌కుమార్, సంజయ్‌కుమార్, ఏసీపీ సి.ప్రతాప్ పాల్గొన్నారు.

సభకు హాజరైన జనం



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



మంచి.. చెడు గుర్తించండి

- కోరుట్ల బిడ్డ సంజయ్‌ను ఆశీర్వదించండి
- ప్రజల కష్టాలు తెలిసినవాడు
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

జంగ్ తెలంగాణ

కోరుట్ల: యువకుడు.. వైద్యుడు.. కోరుట్ల బిడ్డ బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.కల్వకుంట్ల సంజయ్‌ను ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ కోరారు. శుక్రవారం కోరుట్ల ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. మంచి చెడు ఆలోచించి ప్రజల కష్టాలు తెలిసిన సంజయ్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీల చరిత్ర, నడవడిక అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏంసేవ చేశారన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటును సద్వినియోగం చేయాలన్నారు. గతంలో కోరుట్లకు చాలాసార్లు వచ్చానని ఇక్కడి చేనేత, బీడీ కార్మికుల కష్టాలు తెలుసన్నారు. అందుకే ఎవరు అడగకున్నా చేనేత కార్మికులకు పింఛన్లు, బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తున్నామని వివరించారు. పేదల సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ దిశలో లెక్కలేని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో రెండు రెవెన్యూ డివిజన్లతో పాటు తాను బండలింగాపూర్‌కు వచ్చిన సమయంలో చెరువులు చూశామని, అక్కడి ప్రజలు మండలంగా మార్చాలని కోరితే ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో రూ.70 నుంచి రూ.200 పింఛన్ చూశామని, బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రూ.2వేలు చేశామన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో పింఛన్ ఏడాదికి రూ.500 చొప్పున రూ.5వేలకు చేరుతుందని పేర్కొన్నారు.

డాక్టర్ సంజయ్ నా ప్రాణాలు కాపాడాడు

కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.సంజయ్ 2009లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన నిరాహార దీక్ష సమయంలో వైద్యుడిగా తన వెంట ఉండి ప్రాణాలు కాపాడారని సీఎం అన్నారు. యువకుడు, వృత్తిపరంగా వైద్యుడు సంజయ్ తలుచుకుంటే వైద్య వృత్తిలో కోట్ల రూపాయలు సంపాదించవచ్చు, కానీ తండ్రి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బాటలో ప్రజాసేవ కోసం మీ ముందుకు వచ్చాడు. ఆయనను మీరంతా ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కేసీఆర్ కోరారు.

అభివృద్ధి చేశా.. సంజయ్‌ను గెలిపించండి: ఎమ్మెల్యే కల్వకుంట్ల

కోరుట్ల సెగ్మెంట్‌లోని కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలతో పాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని ఆరోగ్యం సహకరించకపోవడంతో తన తనయుడు డా.సంజయ్‌ను అభ్యర్థిగా నిలిపానన్నారు. తన చివరి శ్వాస వరకు నియోజవకర్గ ప్రజలకు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. అందరూ అండగా నిలిచి సంజయ్‌ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

కేసీఆర్ దీక్ష స్ఫూర్తి: బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేత కేసీఆర్ దీక్ష స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ, నేను మీ గడ్డ మీద పుట్టిన బిడ్డను..మీరు పీల్చిన గాలి పీల్చినవాన్ని..మీ కష్టసుఖాల్లో నాన్నతో పాటు పాలుపంచుకున్న..ఈ ఎన్నికల్లో నన్ను ఆదరించండి అని కోరారు. కోరుట్లలో వరద కాల్వలో క్రికెట్ ఆడేవాళ్లం, ఇప్పుడు నిండా నీటితో కళకళలాడుతోందని తెలిపారు. మీకు సీఎం కేసీఆర్ చాలా చేశారు. ఇంకా కొంత మంది బీడీ కార్మికులకు జీవనభృతి రావాలని, వారందరికీ ఇవ్వాలన్నారు. ఎంపీగా బీజేపీ అర్వింద్‌కు అవకాశం ఇచ్చారు. అర్వింద్ ఐదేళ్లలో చేసింది గుండుసున్నా అన్నారు. సభలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎల్.రమణ, జెడ్పీ చైర్మన్ దావ వసంత, గొడిసెల రాజేశంగౌడ్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మున్సిపల్ చైర్మన్లు అన్నం లావణ్య, రనవేని సుజాత, జెడ్పీటీసీలు దారిశెట్టి లావణ్య, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంటాల భారతి, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, కాటిపెల్లి సరోజన, జాజల భీమేశ్వరి, కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్

కోరుట్ల/కోరుట్లరూరల్: సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 2 గంటలకే భారీ సంఖ్యలో జనం చేరుకున్నారు.

- సభాప్రాంగణం పూర్తిగా జనంతో నిండిపోయింది. కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.
- ఆర్మూర్ నుంచి సాయంత్రం 4.42 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్న కేసీఆర్.. 4.45 గంటలకు సభాస్థలికి వచ్చారు.
- ముందుగా సభలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడి ఒక నిమిషంలోనే ప్రసంగాన్ని ముగించారు.
- తర్వాత కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ 4 నిమిషాలు మాట్లాడి పలు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు.
- 4.51గంటలకు కేసీఆర్ ప్రసంగం మొదలుపెట్టి 5.08 గంటలకు ముగించారు.
- చివరలో ఒక నిమిషం మైనార్టీలను ఉద్దేశించి హిందీలో మాట్లాడారు.
- 5.14 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

నామినేషన్ల స్వీకరణ షురూ

- కరీంనగర్‌లో మూడు, హుజూరాబాద్‌లో ఒకటి దాఖలు
- మూడంచెల కట్టుదిట్టమైన భద్రత
- అడుగడుగునా వీడియో చిత్రీకరణ


హుజూరాబాద్‌లో నామినేషన్ వేస్తున్న చింత అనిల్ కుమార్

కరీంనగర్ అర్బన్/హుజూరాబాద్: నామినేషన్ల ఘట్టం శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 10వరకు నామినేషన్లను స్వీకరించనుండగా ఎన్నికల యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి గానూ కలెక్టరేట్ వెనుకాల గల ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజు మూడు నామినేషన్లు దాఖలు కాగా స్వతంత్ర అభ్యర్థులుగా తమ సెట్లను ఆర్వో కె.మహేశ్వర్‌కు అందజేశారు. నగరంలోని విద్యానగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త కోట శ్యామ్‌కుమార్, ముకరంపురకు చెందిన ఆటో డ్రైవర్ నగునూరి ఎల్లయ్య, చింతకుంటకు చెందిన నిరుద్యోగి బెల్లపు కరుణాకర్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పిరమిడ్ పార్టీ అభ్యర్థి చింత అనిల్ కుమార్ ఒకసెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రాజు తెలిపారు.

మూడంచెల భద్రత

శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గ కేంద్రాల్లో నామపత్రాల దాఖలుకు భద్రత కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుతంగా నామినేషన్ల దాఖలు జరిగేలా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. సీపీ అభిషేక్ మహంతి పర్యవేక్షణలో నిత్యం నామినేషన్ల స్వీకరణలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 40మంది వరకు పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయానికి 200ల మీటర్ల పరిధిలో వాహనాలను నియంత్రించేలా ఏర్పాటు చేయగా 100 మీటర్ల వరకు మూడు వాహనాలను అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో సదరు నియంత్రణ చర్యల్లో భాగంగా మూ డంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ రెండో గేట్ వద్ద అనుమతించనుండగా నూతన కలెక్టరేట్ భవన మూల మలుపు వద్ద మరో తనిఖీ బృందం, ఆర్వో కార్యాలయం వద్ద మరో భద్రతా విభాగం తనిఖీ చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ దేశానికి పట్టిన దరిద్రం


ప్రచారంలో గద చూపిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- ఎన్నికల ప్రచారంలో మంత్రి కమలాకర్

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీలు ఆంధ్రా పార్టీలని.. దేశానికి పట్టిన దరిద్రమని బీఆర్‌ఎస్ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం మంకమ్మతోట, రాంనగర్, పద్మనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగల పార్టీలని అన్నారు. ఇక్కడ కొట్టుకుంటున్నా.. ఢిల్లీలో ఒక్కటే అని ఆరోపించారు. 32 కేసులు ఉన్న వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇస్తుందన్న ప్రచారంతోనే ఆ పార్టీ నైజం ఏమిటో తెలిసిపోతుందని అన్నారు. కరీంనగర్‌లో పదేళ్లల్లో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వ్యాపార వర్గాలకు అండగా ఉంటాం

భావితరానికి గొప్ప నగరాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కమలాకర్ అన్నారు. వైశ్యభవన్‌లో నగర వ్యాపార, వర్తక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే మరోసారి కారు గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. గణేశ్‌నగర్‌లోని ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

అబద్ధాల పార్టీలకు గుణపాఠం తప్పదు

- మేయర్ వై.సునీల్‌రావు


మాట్లాడుతున్న మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: అబద్ధాలకు బ్రాండ్‌అంబాసిడర్ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన లేకుండా అడ్డగోలు విమర్శలు చేయడం కాంగ్రెస్, బీజేపీలకే చెల్లిందని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించడాన్ని స్వాగతిస్తున్నామని, 1,632 మీటర్ల పొడవుతో 85 గేట్లతో నిర్మాణం చేసిన ప్రాజెక్టులో మూడు పిల్లర్లు సాంకేతిక కారణంతో కుంగితే ప్రాజెక్టే మునిగినట్లు ప్రచారం చేయడం వారికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఎంపీ బండి సంజయ్ కలలో వచ్చిన మాటలు మాట్లాడుతున్నారని, కరీంనగర్‌లో ఎంఐఎంను మేయర్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తప్పుడు కూతలు కూస్తున్నాడని అన్నారు. ఎంఐఎంను బూచిగా చూపించి మాట్లాడటం తప్ప సంజయ్‌కి అభివృద్ధి అంటే తెలియదన్నారు. కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఓటు అనేది ప్రతీపౌరుడి హక్కు. మన ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడే బాధ్యత మనదే..
– హిల్లరీ క్లింటన్

మీకు తెలుసా..?

అభ్యర్థుల తప్పుడు వివరాలపై మీరూ ఫిర్యాదు చేయొచ్చు

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ప్రారంభం కాబోతుండగా సామాన్యులూ ఎన్నికల క్రతువులో భాగం కావొచ్చు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమ విద్య, వ్యాపారం, ఆస్తులు, అప్పులు, నేరచరిత, వారసత్వ సంపదను వారి అఫిడవిట్‌లో పొందుపరచాలి. దీన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. కొందరు తమ వివరాలను తప్పుగా చూపే అవకాశం కూడా ఉంది. అయితే.. అభ్యర్థులు సమర్పించిన వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే, లేదంటే ఫిర్యాదులు ఉంటే ఎవరైనా తెలియజేయొచ్చు. నేరుగా వారిపై ఫిర్యాదు చేయొచ్చు. అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని సంబంధిత అధికారికి అందించిన వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపిస్తారు. అనంతరం ఆ కార్యాలయ నోటీస్ బోర్డుపై అభ్యర్థుల అఫిడవిట్ ఉంచుతారు. వీటిని ఎవరైనా పరిశీలించి, సమాచారం తప్పుగా ఉన్నట్లు తెలిస్తే అభ్యంతరాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.

రేపు జాతీయస్థాయి కవి సమ్మేళనం

కరీంనగర్‌కల్చరల్: భవానీ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం జాతీయస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్, బాధ్యుడు నూజెట్టి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న సమ్మేళనాన్ని భాషా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా జలేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని అన్నారు. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పద్య కథా సౌరభం, డాక్టర్ పాండాల మహేశ్వర్ గేయ కావ్యం పంచాక్షరి పుస్తకాలను ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ట్యాగ్‌లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి కంద సార్వభౌమ, డాక్టర్ రాధ, శ్రీతెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత గులాబీల మల్లారెడ్డి పాల్గొంటున్న ప్రారంభ సమావేశం తర్వాత ఆక్స్‌ఫర్డ్ స్కూల్ చైర్మన్ వుష్ప లింగయ్య సౌజన్యంతో కళాహంస, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ కృష్ణ సాహితితో అష్టాదశ శక్తి పీఠాలపై నాట్య ప్రదర్శన, డీవీ, నాట్య శ్రీనాథ, అభినవ తెనాలి రామకృష్ణ, డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణతో భిక్షమంగళ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు గుడు పొట్లూరి హరికృష్ణ ముగింపు సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. కవుల కవితలతో రూపొందించిన కవన కలశం కవితా సంకలనంతో పాటు చొడూరి నరసింహారావు కవిత్వం నవ కవిరత్నాలు, దూత రామ కోటేశ్వరరావు కవిత్వం భావచలన పుస్తకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఇరు రాష్ట్రాల కవులు, రచయితలు హాజరయ్యే ఈ కార్యక్రమానికి స్థానిక కవిత్వ సృజనకారులు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

పత్తి ధర రూ.7,200



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,200 పలికింది. మార్కెట్‌కు పాతపత్తి 16వాహనాల్లో 314 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.9,890 పలికింది. కొత్తపత్తి 92 వాహనాల్లో 1,023 క్వింటాళ్లు తేగా గరిష్ఠ ధర రూ.7,150, మోడల్ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.6,300 పలికింది. గన్నీ సంచుల్లో 38మంది రైతులు 57క్వింటాళ్ల పత్తిని తేగా.. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,800, మోడల్ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.6,300కు వ్యాపారులు కొనుగోలు చేశారు. యార్డుకు శని,ఆదివారాలు సాధారణ సెలవు ఉంటుందని, సోమవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ తెలిపారు.

అవినీతిని వ్యతిరేకిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: అవినీతి మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి అని ఎల్ఐసీ కరీంనగర్ డివిజన్ మేనేజర్ వీవీ.నారాయణ తెలిపారు. 'అవినీతిని వ్యతిరేకిద్దాం.. దేశానికి కట్టుబడి ఉందాం' అనే నినాదంతో దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ నిఘా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో జాతీయసేవా పథకం, భారతీయ జీవిత బీమా సంస్థ సంయుక్తంగా అవినీతి వ్యతిరేకతపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్ఐసీ కరీంనగర్ శాఖ డివిజనల్ మేనేజర్ వీవీ.నారాయణ మాట్లాడుతూ అవినీతి నివారణకు నడుం బిగించకపోతే మనకు, మన కుటుంబానికి, మన దేశ అభివృద్ధికి తీరని నష్టం వాటిల్లుతుందని వివరించారు. పీఐడీపీఐ అనే ఆండ్రాయిడ్ యాప్ ద్వారా అవినీతిని గురించి జాతీయ నిఘా కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వ్యాసరచన, ఉపన్యాసపోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ , ఎల్ఐసీ కరీంనగర్‌శాఖ పరిపాలన అధికారి సంపత్‌రెడ్డి, ఉన్నత శ్రేణి సహాయకులు పెనుగొండ బసవేశ్వర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓసీపీ-3 ఈపీ ఆపరేటర్ కె.నరేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. పోతనకాలనికి చెందిన నరేందర్ తన బైక్‌పై కాలనీ నుంచి పోతనాకాలనికి వెళ్తున్నాడు. గోదావరిఖని నుంచి వస్తున్న ఓ కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో నరేందర్ అదుపుతప్పి పడిపోయాడు. అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు, బ్లూకోల్ట్స్ పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌లో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కరీనంగర్‌లోని మరో ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు సమాచారం. తమకు ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా

- ఎన్నికల వేళ ఎక్సైజ్ పోలీసుల దాడులు
- జిల్లాలో ఇప్పటివరకు 571 కేసులు
- రూ.కోటి విలువైన మద్యం స్వాధీనం

కరీంనగర్ క్రైం: ఎన్నికల వేళ అక్రమ మద్యం అమ్మకాలు, నిల్వలు పెరుగుతుంటాయి. ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వాటిలో మద్యం ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుందని గుర్తించిన ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎన్నికల్లో అక్రమ మద్యాన్ని అరికట్టాలని ఎన్నికల నోటిఫికేషన్ రాగానే సమాయత్తమై, స్టేషన్ల వారీగా ప్రత్యేక ఎక్సైజ్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు, వాహనాల తనిఖీ చేపడుతూ కేసులు నమోదు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 5 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 431 కేసులు నమోదు చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అక్రమ మద్యం అమ్మకాలు, నిల్వలను అరికడతామని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. ఇందుకోసం ఎక్సైజ్ శాఖ ఆధ్వరయలో ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ : 8019263862, టోల్ ఫ్రీ నంబర్ : 1800-425-2523 ఏర్పాటు చేశారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

1.7 కిలోల గంజాయి స్వాధీనం

జిల్లా వ్యాప్తంగా 3 గంజాయి కేసులు నమోదు చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం నిల్వలు, రవాణాపై దృష్టిసారించాం. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.కోటి విలువైన మద్యం పట్టుకున్నాం. ఈ విషయంలో ఎంతటివారైనా చర్యలు తీసుకుంటాం.

– పి.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జిల్లాలో పట్టుకున్న మద్యం

ఎక్సైజ్ స్టేషన్	కేసులు	మద్యం విలువ (రూ.లక్షల్లో)
కరీంనగర్ అర్బన్	52	13.09
కరీంనగర్ రూరల్	136	22.47
తిమ్మాపూర్	123	21.49
హుజూరాబాద్	125	20.28
జమ్మికుంట	135	25.05
మొత్తం	571	1.02 కోట్లు

హక్కులను తుంగలో తొక్కిన కేసీఆర్

- విద్యారంగ, నిరుద్యోగ సమస్యలను విస్మరించిన బీఆర్ఎస్
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న నాయకులు

కరీంనగర్: రెండు దఫాలుగా రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ విద్యారంగ, నిరుద్యోగ సమస్యలను విస్మరించిందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా విద్యార్థి యువజనులంతా నడుంబిగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్ విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ అభ్యర్థులను గత ఎన్నికల హామీలపై నిలదీయాలని సూచించారు. ప్రత్యేక రాష్ట్రంలో విద్యార్థులు, యువకుల హక్కులను కేసీఆర్ తుంగలో తొక్కారని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు కాలేదని, ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేసి, ప్రైవేటు వర్సిటీలకు అనుమతి ఇచ్చారని మండిపడ్డారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలతో నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని అన్నారు. కరీంనగర్‌కు ఒక్క ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఇవ్వలేదని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్, జిల్లా ఆఫీస్ బేరర్ కనకం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నునవత్ శ్రీనివాస్ నాయక్, కసిరెడ్డి సందీప్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రూ.లక్ష కోట్ల ప్రజాధనం నీటిపాలు

- ఏఐఎఫ్‌బీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి



మాట్లాడుతున్న జోజిరెడ్డి

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని ఏఐఎఫ్‌బీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ శాసనసభ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ స్వీయ ఇంజినీరింగ్ పరిజ్ఞానంతో నిర్మించిన మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులకు మూడేళ్లకే పగుళ్లు వచ్చాయని విమర్శించారు. మిడిమిడి జ్ఞానంతో వాస్తవాలకు విరుద్ధంగా ప్రాజెక్టులు నిర్మించి, రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీటిపాలు చేశారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పేరుతో పేదలను మభ్యపెడుతూ వాటి ఫలాలను మాత్రం తన పార్టీ నాయకులకు అందిస్తున్నారని ఆరోపించారు. స్మార్ట్ సిటీ నిధులతో కరీంనగర్‌లో జరుగుతున్న పనులు నాసిరకంగా ఉన్నాయని అన్నారు. కేబుల్ బ్రిడ్జి రాష్ట్రానికే తలమానికమని చెప్పిన మంత్రి గంగుల కమలాకర్ అప్రోచ్ రోడ్డు కుంగిపోతే అది మాములు విషయమని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ ఎన్నికల్లో నేతాజీ ఆశయ సాధన కోసం పాటుపడుతున్న ఏఐఎఫ్‌బీ పార్టీని గెలిపించాలని కోరారు. నాయకులు రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మాదిగలకు తీరని అన్యాయం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

రామడుగు(చొప్పదండి): రాష్ట్రంలో మాదిగ బిడ్డలకు తీరని అన్యాయం జరుగుతోందని, పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. నవంబర్ 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం మండలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగల సమస్యలు చెప్పుకోవడానికి కనీసం మంత్రిలేని పరిస్థితి ఉందని, ప్రతి కులానికి మంత్రి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లో మాదిగలకు న్యాయం జరుగుతుంటే ఇక్కడ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. మాదిగకు మంత్రి పదవిలేకపోవడం శోచనీయమని, పదిమంది ఎమ్మెల్యేలు ఉన్నా ఒక్కరూ మంత్రి కాలేకపోయారని, తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్ర ఉన్నతమైందన్నారు. మంత్రి వర్గంలో మాదిగలకు చోటు లేకపోవడం అవమానకరమని, అతి తక్కువ జనాభా ఉన్న వారే మంత్రులుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. వర్గీకరణ అంశం ప్రధానమంత్రికి చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరామని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తడగొండ శంకర్, నాగిశేఖర్, చంటి రాజయ్య, జట్టుపల్లి అనిల్, బెజ్జంకి అనిల్, కొత్తూరు రాజయ్య పలువురు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ప్రజాగర్జన

- హాజరుకానున్న పలు పార్టీల, సంఘాల ప్రముఖులు



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న గజ్జెల కాంతం

కరీంనగర్: దేశంలో బీసీలను దళితులను గిరిజనులను మైనార్టీలను ఏకం చేయడమే లక్ష్యంగా శనివారం నిర్వహించే తెలంగాణ ప్రజాగర్జన బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం కోరారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మాట్లాడిన అనంతరం అంబేద్కర్ స్టేడియంలోని సభ ఏర్పాట్లు పరిశీలించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశాన్ని పాలిస్తున్నాయని అన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతతో పాటు ప్రజాస్వామ్య పరిపుష్టికి ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో జరిగే ప్రజాగర్జన సభకు ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, మహారాష్ట్ర ఎంపీ నవనీత్‌కౌర్, ప్రజాళిక సంఘం ఉపాధ్యక్షుడు బో యిన్‌పల్లి వినోద్ కుమార్, అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

చెరుకు రైతుల పోరాటాన్ని ఆపలేరు

- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి



ఠాణాలో నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): నిర్బంధాలతో చెరుకు రైతుల పోరాటాన్ని ఆపలేరని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. కోరుట్లలో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఆయనతోపాటు సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, రైతులను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేసి, మల్లాపూర్ ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకుంటామన్న బీఆర్ఎస్ రెండు సార్లు అధికారం చేపట్టినా ఆ హామీని నిలబెట్టుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కోరుతున్న చెరుకు రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. షుగర్ ఫ్యాక్టరీలను ఏడాదిలోనే సీఎం కేసీఆర్ మూసివేయించారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం లాభనష్టాలతో సంబంధం లేకుండా ఫ్యాక్టరీలను నడపాలని డిమాండ్ చేశారు. వీటిపై కోరుట్ల సభలో సీఎం ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతులందరూ తమ ఓటుతో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

'రైతు నాయకుల అరెస్టు అప్రజాస్వామికం'

సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా రైతు నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

మల్లాపూర్(కోరుట్ల): సిరిపూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేశారు. రూ.15 వేల విలువైన 21 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పటిక, బెల్లం..

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు చెక్ పోస్టు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ వద్ద ఎక్సైజ్‌శాఖ అధికారులు, పోలీసులు శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నాటుసారా ముడి పదార్థాలు పటిక, బెల్లం లభించాయి. రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని, రవాణాదారులైన రామకృష్ణ, రజితలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయాల్లో చోరీ

కథలాపూర్: భూషణరావుపేటలోని రెండు ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు మార్కండేయస్వామి దేవాలయ తలుపులు ధ్వంసం చేసి, స్వామివారి మెడలోని రూ.20 వేల విలువైన వెండి, బంగారు ఆభరణాలను, హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చొరబడి, హుండీలోని డబ్బులు చోరీ చేశారన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన వెంకటేశ్ 2021లో బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని చెప్పి, ఆమె వద్ద రూ.2.55 లక్షలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. యువతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్ సిటీ: విద్యార్థులందరూ స్థానిక సమస్యలే కేంద్రీకృతంగా పరిశోధనలు చేయాలని, శాస్త్రవేత్తలుగా ఎదగాలని పింగళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.సుహాసిని అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జిజ్ఞాస, రీసెర్చ్ కమిటీ ఆధ్వర్యంలో స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుపై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి రిసోర్స్ పర్సన్‌గా హాజరై ఆమె హాజరై, మాట్లాడారు. చుట్టూ ఉన్న సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, నూతన ఆలోచనలతో పరిశోధనలు సాగించాలని విద్యార్థులకు సూచించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. పరిశోధనలు నిత్యజీవితంలో భాగం కావాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ అన్నారు. కళాశాల జిజ్ఞాస కో–ఆర్డినేటర్ కె.భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ వేదికను సద్వినియోగం చేసుకొని, అధ్యాపకుల సహాయంతో స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులు చేసి, కళాశాలకు సమర్పించాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ సుహాసినిని సన్మానించారు. వర్క్‌షాప్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, ప్రమోద్, రీసెర్చ్ కో–ఆర్డినేటర్ కె.మల్లారెడ్డి, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ ఎ.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి న్యాయవాదులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కరీంనగర్‌క్రైం: పదివసంతాల తెలంగాణలో న్యాయ వ్యవస్థ ప్రగతిపథంపై శనివారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి కరీంనగర్ జిల్లాకోర్టు న్యాయవాదులు తరలివెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొంటారని, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా న్యాయవాదులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బండ గోపాల్‌రెడ్డి, పెంచాల ప్రభాకర్‌రావు, దాసరి రాంరెడ్డి, జెల్ల రమేశ్, మల్యాల ప్రతాప్, మేన మురళీధర్, బొజ్జ స్వామి, కె.లక్ష్మయ్య, పి.ఆంజనేయులు, కొట్టి తిరుపతి పాల్గొన్నారు.

వ్యయ పరిశీలకులొచ్చారు

- ఒక్కొక్కరికి ఒకటి నుంచి 4 నియోజకవర్గాలు
- జిల్లాకు ఇద్దరు చొప్పున నియామకం

కరీంనగర్ అర్బన్: శాసనసభ ఎన్నికల క్రమంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటికే వ్యయ పరిశీలకులను నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం జిల్లాకు వ్యయ పరిశీలకులు రాగా నామినేషన్లు ముగిసేలోపు సాధారణ, పోలీస్ పరిశీలకులు రానున్నారు. నాలుగు దఫాలుగా మకాం వేయనుండటంతో ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ప్రభుత్వ అతిథి గృహాలను వారికి అనువుగా మలుస్తున్నారు.

నాలుగు దశల్లో జిల్లాలో మకాం

- శాసనసభ ఎన్నికల్లో జరిగే వ్యయంపై పారదర్శకంగా వ్యవహరించేందుకు ఎన్నికల వ్యయ పరిశీలకులు సిబ్బందిని ఆదేశించనున్నారు. బీహార్, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమబంగ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను కేటాయించారు.
- ఎన్నికల సాధారణ, పోలీస్ పరిశీలకులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌ను నియమించారు. వీరంతా వారికి కేటాయించిన నియోజకవర్గాల పరిధిలో జరిగే ప్రచార సరళిని నిశితంగా పరిశీలించనున్నారు.
- నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, పోలింగ్, లెక్కింపు ఇలా నాలుగు దశల్లో జిల్లాలో ఉండి పరిస్థితిని సమీక్షించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన దరిమిలా అభ్యర్థుల పూర్తి ఖర్చుల వివరాలను మదింపు చేసి ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు.
- అభ్యర్థి కదలికలు, వ్యయ, ప్రచార సరళిని పరిశీలించి ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తారు. ఇతర రాష్ట్రాల వారు కావడంతో పర్యవేక్షణ పారదర్శకంగా ఉంటుందన్నది ఎన్నికల సంఘం ఉద్దేశం. పోలీస్ పరిశీలకులు శాంతిభద్రతలను సమీక్షిస్తారు.

నియోజవర్గాల వారీగా ఇలా..

కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజక వర్గాలకు కేటాయించిన ఎన్నికల వ్యయపరిశీలకులు కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌజ్‌కు చేరుకోగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఘనంగా స్వాగతం పలికారు. చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులు శివ్ కుమార్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు చిట్టే యోగేష్ సుగ్దియోలకు కలెక్టర్ జిల్లాలోని నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాలు, తదితర వివరాలు అందించారు.



వ్యయ పరిశీలకుడితో కలెక్టర్ పమేలా సత్పతి

పోలీస్ పరిశీలకులు

వివేకానంద్ సింగ్(ఐపీఎస్)	కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి
కుంతల్ కిషోర్	రామగుండం, మంథని, పెద్దపల్లి
ఎ.సతీష్‌గణేశ్	కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్
వినీతసాహు	వేములవాడ, సిరిసిల్ల

సాధారణ పరిశీలకులు

రాజీవ్ రంజన్‌మీనా(ఐఏఎస్)	కోరుట్ల
హెచ్.బసవరాజేంద్ర	జగిత్యాల, ధర్మపురి
రాజేశ్‌సింగ్ రాణా	రామగుండం
సీఎస్ శ్రీధర	మంథని, పెద్దపల్లి
సీఆర్.ప్రసన్న	కరీంనగర్, చొప్పదండి
రవికుమార్	మానకొండూరు, హుజూరాబాద్
జగదీష్‌సాంకర్	వేములవాడ, సిరిసిల్ల



సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధ పడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● **తగినంత నిద్ర**
నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**
ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

● **పరిశుభ్రతను పాటించడం**
ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**
తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.





ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

లైఫ్@360

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.


హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడికి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1996)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరికట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.